www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 12 డిసెంబర్ 2023
5
అన్నమయ్య

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : డిఆర్ఒ

ప్రజాశక్తి - రాయచోటి

జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిఆర్ఓ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన నిర్వహించారు. డిఆర్ఒ సత్యనారాయణ, సర్వే శాఖ ఏడి జయరాజ్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీదారుడు సంతృప్తిచెందేలా అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఎ, రీఓపెనింగ్ లేకుండా సంతృప్తి స్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలన్నారు.అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల, అధికారులు పాల్గొన్నారు.

కన్పించని కార్మికశాఖ కార్యాలయం

కార్యాలయంలో అధికారుల కరువు
అటెండరే కార్యాలయానికి దిక్కు

ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ప్రజాశక్తి- రాయచోటి

అన్నమయ్య జిల్లా ఏర్పడి ఒకటిన్నర సంవత్సరం కావస్తున్నా నేటికీ ప్రభుత్వ కార్యాలయాలు కొన్ని ప్రభుత్వ, అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అయితే కార్మిక శాఖ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండాల్సింది పోయి ఓ మారుమూల సందులో బోర్డు కూడా కనపడినట్లుగానే ఓ చిన్నది ఏర్పాటు చేయడం గమనార్హం. కార్మిక శాఖ కార్యాలయానికి మారుమూల గ్రామాల నుంచి వారి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు వస్తుంటారు. అలాంటి కార్యాలయం రాయచోటి పట్టణంలో ఎక్కడ ఉందో తెలియక నియోజవర్గ, జిల్లా ప్రజలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా నివాసం ఉండాల్సిన అధికారులు ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. కడప కేంద్రంలో ఉంటూ అప్పుడప్పుడు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాల యంలో నిర్వహించే సమావేశాలకు హాజరవుతూ కాలయా పన చేస్తున్నారు. కార్యాలయంలో కేవలం ఓ సిబ్బంది అక్కడ ఉంటూ కాపలా కాస్తుస్తున్నారు. కార్యాలయంలో ఎప్పుడు చూసినా ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుంటాయి.

బోర్డు కన్పించని కార్మికశాఖ కార్యాలయం

అన్నమయ్య జిల్లా ఏర్పడినప్పటి నుంచి కార్మిక శాఖ కార్యాలయం ఎక్కడ ఉందంటూ కొంతమంది పట్టణం అంతా తిరిగినా తెలుసుకోలేని పరిస్థితి ఉంది. ఎక్కడైనా జిల్లా కేంద్రంలో ముఖ్యమైన కార్యాలయాలు ప్రధాన రహదారిలోని ఉండడం గమనార్హం. కానీ జిల్లా ఏర్పడిన కార్మిక శాఖ కార్యాలయం మాత్రం ప్రజలు కనుక్కోలేని విధంగా ఓ మారుమూల సందులో (గునిగుట్ల రోడ్‌లో) ఓ చిన్న అద్దె భవనం లో ఏర్పాటు చేసి అక్కడ బోర్డు కూడా కనిపించకుండా ఒక చిన్న బోర్డును తూతూ మంత్రంగా ఏర్పాటు చేసుకున్నారు. ఏదో ఒక విధంగా తెలుసుకొని అక్కడ వెళ్లిన కార్మికులకు ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నారు. అధికారులెవ్వరూ కన్పించడం లేదు. ఒక్క అటెండర్ మాత్రమే ఉంటారు. ఏదైనా సమాచారం కోసం అతను అడిగితే తనకు తెలియదని తమ అధికారులు క్యాంపుకు వెళ్లారంటూ సమాధానం చెబు తున్నారు. పై అధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని కార్మికులు వాపోతున్నారు. పట్టణంలోని పలు హోటళ్ల ,దుకాణాలు ,వెల్డింగ్ షాపులు చిన్న చిన్న పరిశ్రమల్లో బాల కార్మికులు పనిచేస్తున్నా ఏ అధికారి పట్టించుకున్న పాపాన పోలేదంటూ కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . ఇక జిల్లావ్యాప్తంగా రాజంపేట, రైల్వే కోడూరు, పీలేరు పలు ప్రాంతల్లో కూడా బాల కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉంది. అన్నమయ్య జల్లాలోనే ఎక్కువ భాగం కార్మికులు ఆయా పనులు చేసుకుని జీవన సాగిస్తుంటారు. అలాంటి కార్మికులకు బీమా కార్డు, గుర్తింపు కార్డులు, టూరెంట్స్ ఇన్సూరెన్స్ కార్డులు ఇచ్చిన దాఖలాలు ఎక్కడ లేవు. కార్మికులకు బీమా సౌకర్యం కూడా కల్పించినటువంటి దాఖ లాలు కనబడడం లేదు. ఎక్కడైనా కార్మికుల ప్రమాదాల్లో గాయపడిన చనిపోయిన వారికి ప్రభుత్వంనుంచి ఆర్థిక సాయం అందడం లేదు. జిల్లాలో కార్మిక శాఖ తరపున ఎక్కడ కూడా అవగాహన సదస్సులు నిర్వహించకుండా కాల యాపన సాగిస్తూ తూతూ మంత్రంగా ఉద్యోగం నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్మిక శాఖ కార్యాలయాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచుతూ జిల్లా అధికారులను కార్యాలయంలో ఉండేటట్లుగా చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

అవగాహన కలిగిస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలకు, కార్మికులకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నాం. రాయచోటి కార్మిక శాఖ అధికారి పులివెందులలో ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. నేను మదనపల్లిలో విధులు నిర్వహిస్తున్నాను. అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జిగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నాను. జిల్లా కేంద్రంలో కార్మికులందరికీ అందుబాటు ఉండడానికి ప్రయత్నం చేస్తున్నాం.

-డి.వి.రంగరాజు, కార్మిక శాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి, అన్నమయ్య జిల్లా.

సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలో వైసిపి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే సామాజిక సాధికారత బస్సు యాత్రకు నియోజవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని మాజీమంత్రి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి కోరారు. సోమవారం బైపాస్ లోని మేడా భవన్ లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల వారికి అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. నవరత్నాలను మైనార్టీలు, బిసిలు సద్వినియోగం చేసుకుని ఎంతో అభివృద్ధి చెందితే ప్రతిపక్ష పార్టీ అయినటువంటి టిడిపి నాయకులు వైసిపి పాలనలో అన్యాయం జరిగిందని సమావేశాలు నిర్వహించి విమర్శిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడం వారికి ఎంత మాత్రం తగదని ఆరోపించారు. కమలాపురం నియోజకవర్గంలో జరిగిన సామాజిక సాధికారత బస్సుయాత్రకు భారీ ఎత్తున జనం తరలివస్తే సభ ముగిసిన తర్వాత ఖాళీ కుర్చీలు ఫోటోలు తీసి కొన్ని పత్రికలు, కొన్ని ఎలక్ట్రానిక్ ఛానళ్లు దుష్ప్రచారం చేయడం అన్యాయం అన్నారు. జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు హామీ ఇచ్చిన నవరత్నాలను అధికారంలోకి వచ్చిన తర్వాత సంపూర్ణంగా అమలు చేశారని తెలిపారు. మేనిఫెస్టోలను అమలు చేసిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది జగన్మోహన్ రెడ్డి మాత్రమే అని తెలిపారు. టిడిపి వారు ఉత్తుత్తి మేనిఫెస్టోను ప్రవేశపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం వారికి అలవాటైపోయిందని ఎద్దేవా చేశారు. ఇవన్నీ రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఇంటికి పంపిస్తారని జోష్యం చెప్పారు.

టిడిపి నేతల ఓట్ల తొలగించేందుకు కుట్ర

- ఓటమి భయంతో వైసిపి నాయకుల అడ్డదారులు
-డబుల్ ఎంట్రీ, పేరు మార్పుపై ఆర్‌డిఒకు 'బత్యాల' ఫిర్యాదు

ఆర్‌డిఒకు ఫిర్యాదు చేస్తున్న బత్యాల చంగల్‌రాయుడు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి నేతలు, కార్యకర్తల ఓట్ల తొలగింపునకు వైసిపి నాయకులు కుట్ర పన్నుతున్నారని, రానున్న ఎన్నికలలో ఓటమి భయంతో వైసిపి నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్‌రాయుడు ఆరోపించారు.సోమవారం బత్యాల భవన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి మైనారిటీ సెల్ పట్టణ ప్రధాన కార్యదర్శి, బూత్ కన్వీనర్ అయిన ఎస్.కె అబ్దుల్ కరీం ఓటరు లిస్టులో తన తండ్రి పేరు మార్చి తనను ఏజెంట్‌గా కూర్చొనివ్వకుండా వైసిపి నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. బూత్ కన్వీనర్ సంతకం కూడా లేకుండా మార్పులు-చేర్పులను అధికారులు ఎలా అంగీకరించారో తెలపాలని ప్రశ్నించారు. పురపాలక పరిధిలో సుమారు 600 ఓట్లు డబుల్ ఎంట్రీలు చేశారని, అవన్నీ టిడిపి కార్యకర్తలవేనని అన్నారు. క్రియాశీలకంగా వ్యవహరించే తమ కార్యకర్తలను ఎన్నికల వ్యవహారాల నుంచి దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని, తమను అడ్డుకునే కొద్దీ తాము మరింత ఉత్తేజంగా పుంజుకుంటామని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. వైసిపి ఆటలు ఇక సాగవని, రానున్నది టిడిపి ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. పాత్రికేయుల సమావేశానంతరం అబ్దుల్ కరీం తండ్రి పేరు మార్చడం, డబుల్ ఎంట్రీలపై కార్యకర్తలతో కలిసి బత్యాల చెంగల రాయుడు ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. పొరబాట్లను పరిశీలించి ఒత్తిళ్లకు లొంగి బూత్ లెవెల్ అధికారులు తప్పు చేసినట్లు రుజువైతే వారిని విధుల నుంచి తొలగిస్తామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు. అవకతవకలపై ఆధారాలతో రావాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాసాపేట అభివృద్ధికి ప్రత్యేక కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎల్లవేళలా తాము పేదలకు అండగా ఉంటూ, మాసాపేట అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి మున్సిపల్ పరిధిలోని మాసాపేట 2 వ వార్డులో రూ.15 లక్షల నిధులతో సిసి రోడ్డు, 34వ వార్డులో రూ.80 లక్షలతో పూర్తయిన సిమెంట్ రోడ్లు, డ్రైయినేజీ శిలాఫలకాలను రూ 9 లక్షల సోలార్ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్, రూ. 9 లక్షల మెప్మా సిఆర్‌సి భవన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహంభావం, అహంకారం, రౌడీయిజం లేకుండా సామరస్యంగా ఉంటూ మరింత బాధ్యతతో రాయచోటిని అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైస్ చైర్మన్ దశరథ రామిరెడ్డి, కౌన్సిలర్లు సుగవాసి పద్మావతి, గూడూరు అమ్మాజీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సురక్షిత మాతృత్వానికి అవకాశం ఇవ్వండి

పీలేరు : గర్భిణులు ప్రతినెలా 9న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య పరీక్షలను విధిగా చేయించుకుని సురక్షిత మాతృత్వానికి అవకాశం ఇవ్వాలని డాక్టర్ రమేష్ రెడ్డి తెలిపారు. సోమవారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వ్యాధి నిర్ధారణ, రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్, అల్బుమిన్, గ్రూపింగ్, మధుమేహం, అధిక రక్తపోటు మొదలగు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఐరన్ మాత్రలు, కాల్షియం, ఆల్బెండజోల్, మాత్రలు పంపిణీ చేసి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న దూరప్రాంత గ్రామీణ గర్భిణులు 28 మందికి తలుపుల నివాసి నీళ్ల రామ్మోహన్ బ్రెడ్లు పంపిణీ చేశారు.

గర్భిణులకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న దాతలు

దళితుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

దళితుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని కలెక్టర్ గిరీష పి.ఎస్ అన్నారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్లో జిల్లా షెడ్యూల్ కులాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో జగనన్న దళిత సంపూర్ణ భూ హక్కు పథకం కింద 453 ఎస్‌సి మహిళా రైతులకు ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం శ్రీనివాసులుతో కలిసి సంపూర్ణ భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి కొనుగోలు పథకం కింద భూములు ఇచ్చిన ఎస్‌సి లబ్ధిదారులకు పూర్తి భూ యాజమాన్య హక్కు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'జగనన్న దళిత సంపూర్ణ భూ హక్కు పథకం' ప్రారంభించి అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 453 మంది రైతులకు 567.20 ఎకరాలకు గాను రూ.193.57 లక్షలను మంజూరు చేసి ఎస్‌సి మహిళా లబ్ధిదారుల భూమిని తనఖా నుండి విడుదల చేసి వారికి లబ్ధి చేకూర్చడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.

లబ్ధిదారులకు భూ హక్కు పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ గిరీష

ఎస్‌పి కార్పొరేషన్ డైరెక్టర్ మాట్లాడుతూ. దళితుల అభివృద్ధికి ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే అనేక సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి దళితులు అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు పాటు పడుతోందని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని దళితులందరూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులముల కార్యనిర్వాహక సంచాలకులు డాక్టర్ హెచ్ వెంకట సుబ్బయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలి : డిజిపి

డిఎస్‌పి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మాసాపేటలోని డిఎస్‌పి కార్యాలయాన్ని, చిత్తూరు రోడ్డులో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఎపి రాష్ట్ర డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ముందుగా అయన పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. డిఎస్‌పి కార్యాలయాన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లోని ప్రతి ఒక్క గదిని పరిశీలించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా రాయచోటి పట్టణంలో అత్యంత ఆధునీకరణంగా విశాలమైన ప్రాంగణంలో కార్యాలయాలు నిర్మించడం సంతోషదాయకమని చెప్పారు. 1.5 ఎకరాలలో డీఎస్పీ కార్యాలయం,1.5 ఎకరాలలో కోవిడ్ ఉన్నా కూడా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, డిఎస్‌పి కార్యాలయాన్ని కేవలం ఒకటిన్నర సంవత్సరంలో పూర్తి చేశారన్నారు. రాయచోటి ట్రాఫిక్‌తో కూడిన ప్రాంతం కాబట్టి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉన్నా దాన్ని ఎమ్మెల్యే సహకారంతో మరింత అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. 42 మంది ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ప్రజలకు విధులు నిర్వహిస్తారని, ఎమ్మెల్యే, అధికారుల కృషి ఫలితంగా డిఎస్‌పి కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటయిందని చెప్పారు. ప్రజలకు చేరువలో ఉంటూ వారికి సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కర్నూల్ రేంజ్ ఐజి సిందిల్ కుమార్, అన్నమయ్య జిల్లా ఎస్‌పి కృష్ణారావు, కలెక్టర్ గిరీష, డిఎస్‌పి మహబూబ్ బాషా, అర్బన్ సిఐ సుధాకర్ రెడ్డితో పాటు ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : డిజిపి కసిరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి రాయచోటికి వెళ్తూ మార్గమధ్యలో రైలే కోడూరులోని ముఖ్యమంత్రి సలహాదారుడు రక్కాసి ధనుంజయ్ రెడ్డి నివాసానికి వచ్చారు. డిజిపిని వైసిపి మండల కన్వీనర్ వత్తలూరు సాయి కిషోర్ రెడ్డి, అన్నమయ్య జిల్లా వ్యవసాయక మండలి చైర్మన్ పంజమ్ సుకుమార్ రెడ్డి, పుల్లంపేట ఎంపిపి ముద్దా బాబుల్ రెడ్డి, చిట్వేల్ మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, గురివి రెడ్డి, జెసియస్ మండల కన్వీనర్ అమరేశ్వర్ రెడ్డి, చిన్న ఓరంపాడు ఎంపిటిసి గోగడ దుర్గా ప్రసాద్ నాగినేని రమేష్ కుమార్ నాయుడు, యువ నాయకులు అశోక్,మారే సుకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

దళారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్న కారణంగా అమాంతంగా బియ్యం, నిత్యావసర సరుకులు వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయని, వెంటనే తగ్గించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, జిల్లా కేంద్రమైన రాయచోటి లో ఇంటి అద్దెలు విపరీతంగా పెంచుతున్నారని వెంటనే ధరలు తగ్గించి ప్రజానీకానికి మేలు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ. రామాంజులు డి . వెంకట్రామయ్య డిమాండ్ చేశారు. సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట ప్రజానీకంతో కలసి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో రామాంజులు మాట్లాడుతూ రైతుల వరి పంట దిగుబడి వచ్చినా దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి వారు మాత్రం వ్యాపారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని చెప్పారు. 23 కేజీల బియ్యం మార్కెట్ లో రూ.1600 నుంచి రూ. 1700 పలుకుతోందన్నారు. నిత్యావసర సరుకులైన తెల్లగడ్డలు, అల్లం, పచ్చి, కూరగాయలు అన్ని ధరలు పెరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం ధరలస్థిరీకరణకు బడ్జెట్ కేటాయించకుండా ధరల నియంత్రణకు చట్టంచేయకుండా నేరుగా దళారులకు స్వేచ్ఛ ఇవ్వడం వల్ల ధరలు అమాంతంగా పెరుగుతన్నాయని చెప్పారు. రాయచోటి జిల్లా కేంద్రమైన తర్వాత ఇంటి బడుగు అద్దెలు భారీగా పెంచడం దారుణమన్నారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఇంటి కొలతల ఆధారంగా అద్దె ఉండేలా ప్రభుత్వం షరతులు విధించాలన్నారు. అధికారులు ఆదిశ గా చర్యలు చేపట్టాలన్నారు. అతి తక్కువ కూలీతో బతుకుతన్న వలసకార్మికులకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పేద మధ్య తరగతి ప్రజానీకం తో పాటు చిరు వ్యాపారుల సరుకులు అద్దెలు తాళలేక ఇక్కట్లకు గురవుతున్నారని వీటికి అడ్డుకట్ట వేయాలని కోరారు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

ఉమ్మడి కుటుంబంగా ఉండాలి : గిరీశ

పునరావాసులకు కేటాయించిన స్థలంపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుల్లంపేట

ఊరు అంటే ఉమ్మడి కుటుంబంగా ఉండాలని ప్రజలందరూ సహకరిస్తే రెండు, మూడు రోజుల్లోపు కాపుపల్లె వాసులకు పునరావాస సాయం మంజూరు చేస్తామని కలెక్టర్ గిరీష పి.ఎస్ తెలిపారు. సోమవారం మంగంపేట ఆర్అండ్ఆర్ 5లో భాగంగా పునరావాసం నిమిత్తం ఏర్పాటు చేసిన లేఅవుట్‌లలో ఇళ్ల స్థలాల కేటాయింపు అంశంపై కాపుపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మంగంపేట ఆర్అండ్ఆర్5 లో భాగంగా కాపుపల్లి దళితవాడ, అరుంధతివాడ వాసులకు సహాయ పునరావాసం కింద ఇళ్ల స్థలాల కేటాయింపునకు లే అవుట్ వేశామన్నారు. ఇందులో హరిజనవాడ, అరుంధతివాడ వాసులు పూర్తిగా సహకరించి తమ అంగీకారం తెలియజేయడంతో వారికి ఇప్పటికే పునరావాసం ఆర్థిక సహాయాన్ని అందజేశామని చెప్పారు. కాపుపల్లిలో ప్రజలందరూ ఒక అవగాహనకు రాకపోవడం వల్ల లేఅవుట్‌లో ఇళ్ల స్థలాల కేటాయింపు చేయలేదన్నారు. ఈ అంశానికి సంబంధించి కాపుపల్లి వాసులతో ఇప్పటికే ఒకటికి పదిసార్లు ఇప్పటికే ఒకటికి పదిసార్లు సమావేశాలు నిర్వహించినా చిన్న చిన్న అపోహలతో వారందరూ ఒక అవగాహనకు రాకపోవడంతో సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. కాపుపల్లి వాసులకు మంచి సహాయ పునరావాసం కల్పించడానికి అధికారులందరూ సహకరిస్తున్నారని చెప్పారు. అలాంటప్పుడు మీరు కూడా వారికి సహకరించాలని సూపచించారు. గ్రామంలో ఇప్పటికే 252 మంది తమ అంగీకారం తెలియజేస్తూ సంతకాలు చేశారని . ఇంకను 70 నుంచి 75 మంది తమ అంగీకారం తెలియజేయాల్సి ఉందని చెప్పారు. ఇందులో మీకు ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. సమస్య పరిష్కారానికి కాపుపల్లి వాసులందరూ ఉమ్మడిగా కలిసి రావాలని కలెక్టరు కోరారు. పలు దఫాలుగా చర్చించిన తురువాత కేటాయించిన లేఔట్ లో ఇళ్ల స్థలాలు తీసుకోవడానికి గ్రామస్తులు అంగీకారం తెలియజేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన నాయకులను, గ్రామస్తులను కలెక్టర్ అభినందించారు. తహాశీల్దార్‌కు తమ అంగీకార పత్రాలు అందజేయాలని గ్రామస్తులకు కలెక్టర్ సూచించారు. రెండు, మూడు రోజుల్లోగా కాపుపల్లె వాసులకు ఒటిఎస్ కింద పునరావాస సహాయం, అలాగే ట్రక్కర్లకు కూడా వెంటనే ఆర్థిక సాయం మంజూరు చేస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో రాజంపేట ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి, తహాశీల్దార్ పుల్లారెడ్డి, ఎపిఎండిసి అధికారులు, ఆర్ఐ రామ్మోహన్, రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి, పులపుతూరు రామసుబ్బారెడ్డి, కాపుపల్లి గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లపై చర్యలు తీసుకోవాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - రాయచోటి

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి నష్టపోయిన బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. జాబిర్ సోమవారం రాయచోటి స్పెషల్ బ్రాంచి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాబీర్ మాట్లాడుతూ నిన్న, నేడు ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపులలో ఎస్‌బిఐ ఇంటర్నెట్ బ్యాంకింగ్ పనిచేయటం లేదని, వెంటనే ఈ కింది ఎస్‌బిఐ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని సైబర్ మోసగాళ్లు అనధికారిక యాప్ చొప్పించి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయ వాట్సాప్ గ్రూపులలో వచ్చిన తప్పుడు సమాచారాన్ని సైబర్ క్రైమ్ పట్ల అవగాహన లేని కొంతమంది ఉపాధ్యాయులు అనధికారిక ఎస్‌బిఐ యాప్ డౌన్ లోడ్ చేసి పరిశీలించే క్రమంలో వారి అకౌంట్లో నుంచి వేలాది రూపాయలు మోసగాళ్ల అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు గుర్తించారని తెలిపారు. డబ్బులు పోగొట్టుకున్న ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని అన్నారు. సిఐ స్పందిస్తూ ఈ విషయాన్ని ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లి సైబర్ నేరగాళ్లపై తగిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. సైబర్ నేరాలు పట్ల అవగాహన కలిగి మోసాలకు దూరంగా ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులను కోరుతున్నట్టు అయన తెలిపారు.

చిన్నారులకు భోజన పాత్రలు అందిస్తున్న ఎంఇఒలు

విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో ఉండాలి

ప్రజాశక్తి-రామసముద్రం

విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఎంఇఒలు హేమలత, ఆంజనేయులు, ఈస్ట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమలత పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు వికలత్వ భావనతో ఉండరాదని, ఆత్మస్థైర్యంతో, పట్టుదల, ప్రతిభతో రాణించాలని పేర్కొన్నారు. ఎంతో మంది విభిన్న ప్రతిభావంతులు తమ ప్రతిభతో వివిధ రంగాల్లో రాణించి స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు స్టీల్‌ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాన్, పుష్పరాజ్, సిఆర్‌పిలు పాల్గొన్నారు.



ఖాదర్‌బాషా, గంగిరెడ్డిలకు నియామకపత్రాన్ని అందిస్తున్న రామకృష్ణారెడ్డి

కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి

ప్రజాశక్తి-రామసముద్రం

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కలిసికట్టుగా పనిచేస్తామని మదనపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింగం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు ఖాదర్ బాషా, నియోజకవర్గ కిసాన్ అధ్యక్షుడు గంగిరెడ్డిని నియమితులైనట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి , నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలు కాంగ్రెస్ పార్టీని ప్రగతిపథంలో నడిపారని అన్నారు. 2024 ఎన్నికల్లో మ్యానిఫెస్టోలో తమ నాయకులు రాహుల్ గాంధీ రైతులకు రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం లాంటి పథకాలతో ప్రజల ముందుకు వస్తామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి తీరుతామని తెలిపారు. అనంతరం 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఈశ్వర్, శ్రీదేవి, సుందర్ రాజు, భాజా, పునీత్, నిరంజన్, బాబాజాన్ పాల్గొన్నారు.

కుమారధర నుంచి జలాన్ని తెస్తున్న అర్చకులు

వైభవంగా నేలమల్లేశ్వరస్వామి కుంభాభిషేకం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

తవళం గ్రామంలోని శ్రీ యోగ నేలమల్లేశ్వరస్వామి జలపూరిత కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించినట్లు ఆలయ తాత్కాలిక కమిటి సభ్యులు గోపాలకృష్ణ తెలిపారు. కుంభాభిషేక ఉత్సవాల్లో ముఖ్యఅతిథులుగా ఆలయ ఇఒ మంజుల, మండల వైసిపి మాజీ కన్వీనర్ ఆర్.వి.రమణారెడ్డి పాల్గొన్నారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో జలపూరిత కుంభాభిషేక మహోత్సవాన్ని ఆలయ ఇఒ, ఆలయకమిటీ ఆధ్వర్యంలో అర్చకులు శంకరస్వామిశాస్త్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.జల పూరిత కుంభాభిషేక రూపంలో నేల మల్లేశ్వరస్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచి అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, శంకర, గంగాధర, రవి, నారాయణ కుంభాభిషేకం ఉత్స వాన్ని నిర్వహించారు. పలువురు ప్రముఖులు మాజీ ఎమ్మెల్యే షాజ హాన్‌బాషా, శంకర భాస్కరస్వామి వారిని దర్శించుకున్నారు. స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

Union Bank of India (A Government of India Undertaking) — **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

రీజినల్ ఆఫీసు: 21/58, బిఎస్ఎన్ఎల్ కాంపౌండు వద్ద అనెక్ష్ బిల్డింగ్, హెడ్ పోస్టు ఆఫీసు ప్రక్కన, ట్రంక్ రోడ్, కడప-516001, ఎ.పి.
బ్రాంచి ఇ-మెయిల్-..........; సంప్రదించాల్సిన నం.: 9494631442.

స్వాధీనత ప్రకటన
(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(1)- స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రాజంపేట్ బ్రాంచి (65010), కడప యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **తేది: 28.07.2023** నాటి డిమాండ్ నోటీసు జారీచేసి, **రుణగ్రహీత: (1) శ్రీమతి పి. ఈశ్వరి,** భర్త పి. సత్యనరసింహ గుప్త, మరియు హామీదారు **(2) శ్రీ పి. సత్యనరసింహ గుప్త** ఇరువురి నివాసం: డోర్ నం.5/136-బి, కొలిమి స్ట్రీట్, రాజంపేట-516115 అనువారిని, సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **రూ.2,79,049.25 పై.లు (రూపాయలు రెండు లక్షల డెబ్బై తొమ్మిది వేల నలభై తొమ్మిది మరియు ఇరువై ఐదు పైసలు మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.

రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని క్రింది సంతకందారు **06.12.2023న స్వాధీనంచేసుకున్నారు.**

ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రాజంపేట్ శాఖకు చెల్లింపులుచేయుటకులోబడి ఉంటుంది. బకాయిలకు ఏవేని మొత్తాలు చెల్లించినట్లైతే, ఖాతాలో ఫైనల్ పేమెంట్ సమయంలో సర్దుబాటుచేయబడుతుంది. సెక్యూర్డ్ అసెట్స్ విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్దవహించవలసిందిగా కోరబడుచున్నది.

<u>సెక్యూర్డ్ అసెట్ వివరణ:</u>

పి. ఈశ్వరి పేరున రాజంపేట, నూనెవారిపల్లి, 4వ వార్డు, మసీదు రోడ్డు, బృందావనం అపార్టుమెంట్ యొక్క మూడవ అంతస్తు (ఆమోదత ప్లాన్ ప్రకారం& ప్రస్తుతమున్నది), నాల్గవ అంతస్తు (రిజిస్టరు కాని సేల్ అగ్రిమెంట్ ప్రకారం) 48.00చ.గ.ల విస్తీర్ణంతో ఫ్లాట్ నం.407 యొక్క మొత్తం భాగం మరియు అపార్టుమెంట్ సరిహద్దులు:
తూర్పు: నూనెవారిపల్లి రోడ్డు, పడమర: కృష్ణార్జున రెడ్డి& ఇతరుల ఇల్లు, ఉత్తరం: గుల్జార్ బాషా& ఇతరుల ఇల్లు, దక్షిణం: 20అ.ల వెడల్పు రోడ్డు.

తేది: 06.12.2023 — **సం/- అధీకృత అధికారి**
ప్రదేశం : కడప. — **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరఫున**

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కె.బరినేపల్లి, గొల్లపల్లి, కొత్తపల్లి, జంగంపల్లి, గుట్టపాలెం కస్బాలో బాబు షూరిటి-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో వ్యవస్థలన్నీ తమ గుప్పెట్లో పెట్టుకొని టిడిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఆపహస్యం చేస్తున్నారని ఆరోపించారు. నల్లారి కుటుంబం గత యాభై ఏళ్లుగా నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచే స్తుందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా అదుకోవడానికి సిద్దంగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటరమణారెడ్డి, బయన్న, పి రామయ్య, మునీంద్ర, నరసింహులు, బాలకృష్ణ, కరుణాకర్ , విజయ్ కుమార్ రెడ్డి, దామోదర్ రెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

టిడిపి ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరిస్తున్న నల్లారి కిషోర్‌రెడ్డి

పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు : ఎంపిపి

వీరబల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ మల్లీశ్వరి

ప్రజాశక్తి-వీరబల్లి

గ్రామాల్లో ప్రతి పేదవానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపిడిఒ మల్లీశ్వరి కోరారు. సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన, ఎంపిడిఒ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 12పంచాయతీ పరిధిలో అన్ని గ్రామా ల్లో తాగునీరు, రహదారులు, డ్రెయినేజీ సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ ఎఇ రమేష్‌బాబు మాట్లా డుతూ మండలంలో విద్యుత్ సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ, ప్రాథమిక విద్య, వైద్య, ఆరోగ్యం, గ్రామీణ నీటి సరఫరా విభాగం, రెవెన్యూ, పౌరసరఫరాలు, రోడ్డు, భవనాలు, విద్యుత్, ,శిశు సంక్షేమం, అటవీ, పశుసంవర్ధకశాఖ, పంచాయ తీరాజ్ శాఖలపై అధికా రులు నివేదికలు అందజేశారు. డాక్టర్ సయ్యద్ జియాఉల్లామ్ మాట్లా డుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు సాధ్యమైనంత సాధారణ ప్రస వాలనే చేస్తున్నామని, అత్యవసరమైతేనే సిజేరియన్ చేస్తారని తెలిపారు. బాలింతకు ఆస్పత్రిలో ఉన్నన్ని రోజులు ఉచితంగా పోషకాహారం అందిదిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి శివరాంగౌడ్, ఎంఇఒ కృష్ణయ్య, హౌసింగ్ ఎఇ వెంకటేష్, ఎపిఒ నాగరాజ్, ఎటిఎం ఖాదర్‌వలీ, శకాధికారులు, సర్పంచ్‌లు, జడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులు స్పందించాలి

లక్కిరెడ్డిపల్లి : మండల సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై అధికారులు స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో ఏర్పాటుచేసిన మండల సమావేశానికి జడ్‌పిటిసి రమాదేవితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సమస్యలపై ఆరా తీశారు.కరువు మండలంగా లక్కిరెడ్డిపల్లి మండలాన్ని ప్రకటించడంతో జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలికి 150 పని దినాలు కల్పించేలా చొరవ చూపాలన్నారు.ఉపాధి ద్వారా హౌసింగ్ లబ్దిదారులకు చెల్లించే బిల్లులు అలసత్వం చేయకుండా చెల్లించేలా చూడాలని కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్ సూచించారు. పనులకు సంబంధించి ప్రణాళికను సిద్ధం చేసేలా చూడాలని మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి తెలిపారు. రైతులకు సంబంధించి ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉండేలా చూడాలని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అసైన్మెంట్ కి సంబంధించి 262 మంది కి 464 కి పంపించాము. అనంతపురం గ్రామంకు సంబంధించి రి సర్వే జరిగి ఆరు నెలలు అవుతున్న పాస్ బుక్ లో పంపిణీ చేయకుండా ఆపమని, అందులో భూములు వ్యత్యాసం ఉన్నందున ఇప్పటివరకు సరి చేయకుండా ఉండడం పై ఉప మండల అధ్యక్షుడు మండిపడ్డారు.రెండవ అసైన్మెంట్ జనవరి 10లోపు పూర్తి చేయాల్సి ఉన్న ఇంతవరకు గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రీ సర్వే జరిగిన గ్రామాలలో తక్కువ ఎక్కువ పడిన భూముల వివరాలను సరిచేయాలనీ డిప్యూటీ తాసిల్దార్ రెడ్డన్నకు సభ్యులు సూచించారు. జగనన్న కాలనీకి సంబంధించి దారి ఏర్పాటుకు సమస్యను పరిష్కరించేలా చూడాలని ఉపసర్పంచ్ రాజారెడ్డిసభ దృష్టికి తీసుకువచ్చారు. పశువులకు సంబంధించి రైతులు వద్దకు వెళ్లి ఇన్సూరెన్స్ చేయించి బాధ్యత తీసుకోవాలని పశు వైద్యాధికారి కి సూచించారు. మండల సమావేశానికి డుమ్మా కొట్టిన పశుసంవర్ధక శాఖ ఎడిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు రవిరాజు ఎంపిపి దృష్టికి తీసుకొచ్చారు. జగనన్న రైతు నేస్తం ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు 15 రోజుల్లోపు నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి,విద్యుత్ సరఫరాను అందిస్తామని ట్రాన్స్‌కో ఎఇ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరమణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు సమరసింహారెడ్డి, రౌతు నాగలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఎంపీటీసీ సభ్యులు దస్తగిరి, ఉదయగిరి ఎల్లమ్మ, లక్ష్మీనారాయణ, జగన్మోహన్ రెడ్డి,ఉప సర్పంచ్ రాజారెడ్డి, వాటర్ సెడ్ చైర్మన్ సుబ్బరాజు , సర్పంచులు గడ్డం కళ్యాణి ప్రభాకర్ రెడ్డి, రమణయ్య,నాగిరెడ్డి, బాబు,డిటి తాసిల్దార్ రెడ్డన్న, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసిపిని మరోమారు ఆదరించండి:'చింతల'

ప్రజాశక్తి-కలికిరి

రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని మరోమారు ఆదరించి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మూరెవాండ్లపల్లి, కంభంవారిపల్లి, సామకుంటవారిపల్లి గ్రామాలలో గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పుడు నుంచి అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, అమ్మఒడి, వైఎస్ఆర్ చేయూత, ఆసరా వంటి పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డివారి వెంకటరెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, ఎంపిపి శ్రీకాంత్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

అవార్డు గ్రహీతలకు డిఇఒ అభినందన

అవార్డు గ్రహీతలను అభినందిస్తున్న డిఇఒ శ్రీరాం పురుషోత్తం

ప్రజాశక్తి-మదనపల్లి

ఈనెల 10న విజయవాడలో తెలుగు వెలుగు సాహితీ వేదిక సంస్థచే మగ్దూం మొహివుద్దీన్, సేవారత్న అవార్డులు అందుకున్న జడ్‌పి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పఠాన్ మహమ్మద్‌ఖాన్, అప్పలభట్ల ఫణీంద్రస్వామి, షేక్ ముబారక్‌బాషా, పోతురాజుమోహన్‌లను డిఇఒ శ్రీరామ్‌పురుషోత్తం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డును బాధ్యతగా తీసుకొని మరింత అంకిత భావంతో పనిచేసి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడాలని కోరారు. విద్యార్థుల్లో అభ్యసనా స్థాయిని పెంచాలని, తద్వారా విద్యా శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఆర్ వి రమణ, షరాఫత్ అలీఖాన్ పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

మహిళలకు కండువా కప్పి పార్టీకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరాజు

ప్రజాశక్తి-సిద్ధవటం

రాజంపేట జనసేన పార్టీ నేత యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీలో భారీగా చేరారు. సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల నుంచి పెద్దలు, యువకులు, మహిళలు సుమారు 150 మంది చేరారు. ఒంటిమిట్ట మండలం లో పెన్న పేరూరు, కొత్తపల్లి, గంగపేరూరు సాలాబాద్, కొత్తమాధవారం, రాచగుడిపల్లెల నుంచి భారీగా ప్రజలు చేరారని శ్రీనివాసరాజు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలను నచ్చి యువకులు పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీ విజయ దుందుభి మోగించనున్నదని ఆయన ధీమా వ్యక్తం చేశారు కార్యక్రమంలో కట్టా మల్లికార్జున ,వంశీ, రవి ,కదిరి ప్రతాప్, కొత్తపల్లి ఖాదర్ వల్లి, బంద్ గారి బాద్‌షా, గంప రమణ, పోతిరెడ్డి రుద్ర ప్రతాప్, మల్లికార్జున ,బంగారు పల్లె సుబ్రహ్మణ్యం, హరి, బచ్చల నాగేంద్ర, కదిరి గోపయ్య, హరి రెడ్డి ,రేవూరి మూర్తి ,ఏరి పెద్ద సుబ్బయ్య, బొమ్మ తట్టి హరి ,మల్లి, రుద్ర ,నంద్యాల ప్రతాప్, నంద్యాల అజయ్, నరసింహ, ఆకాష్, తిరు వెంకటేష్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
O.S.No. 67 /2018

కసెట్టి పద్మావతి భర్త రామసుబ్బయ్య అనంతసముద్రం గ్రామం పుల్లంపేట మండలం అన్నమయ్య జిల్లా.
...వాది

వర్సెస్

5.నేలపూజ నిర్మల్ తండ్రి సుబ్రహ్మణ్యం, కొత్త దాసరిపల్లి H/O అనంతసముద్రం గ్రామం పుల్లంపేట మండలం అన్నమయ్య జిల్లా.
...ప్రతివాది నెం.5

పైన తెలిపిన వాది, ప్రతివాదైన నీపై పర్మనెంట్ ఇంజక్షన్ కోరుతూ పైకోర్టులో పై దావా దాఖలు చేసి ఉన్నారు. మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న ఎడల స్వయంగా గాని లాయర్ ద్వారా గాని 15-12-2023 వ తేదీన ఉదయం 10:30 నిమిషములకు పైకోర్టులో హాజరై మనవి చేసుకోవలెను లేనంతట మీ పరోక్షంగా తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
టి. రఘునాథ్ రెడ్డి,
అడ్వకేట్,
రాజంపేట.

మహా పాదయాత్రలో పాల్గొన్న 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధి లోని హస్తవరం చెర్లోపల్లి గ్రామ పంచాయతీలోని శ్రీకోదండ రామస్వామి దేవాలయం నుంచి తిరుమల వరకు చేపట్టిన దేవరకొండ భాను మూర్తి శర్మ 31వ తిరుమల మహా పాదయాత్ర మూడవరోజుకు చేరుకుంది. రైల్వే కోడూరు కుక్కలదొడ్డికి వద్ద పాదయాత్ర టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు ఘన స్వాగతం పలికి భాను మూర్తి శర్మకు దుశ్శాలువా సన్మానించరు. అనంతరం భక్తులకు సంఘీభావంగా పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం కుక్కలదొడ్డి పాఠశాల ఎదుట భక్తాదులకు సుమారు ఎనిమిది వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాదయాత్రలో చమర్తి జగన్మోహన్‌రాజు

ఆడుదాం ఆంధ్రకిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు

'ఆడుదాం ఆంధ్ర' కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

ఈనెల 15 నుంచి మండలంలో ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరిగే ఆడుదాంఆంధ్ర కిట్లను మాజీ ఎంపిపి, వైసిపి మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు అయోధ్యపురం నాగభూషన్‌రెడ్డి పంచాయతీ సెక్రటరీలకు పంపిణీ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ సెక్రెటరీలకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో సచివాలయ పరిధిలో ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 2 వరకు క్రీడలు జరుగుతాయని అన్నారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ డబుల్స్ టీమ్‌లకు సంబంధించి క్రికెట్ 32 మంది, బ్యాడ్మింటన్ నలుగురు, ఖోఖో 32మంది, వాలీబాల్ 24 మంది, కబడ్డీ 24 మండి క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో గెలిచిన వారికి మండలస్థాయిలో అనంతరం నియోజకవర్గస్థాయిలో క్రీడలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ హైదర్‌వల్లి, ఇఒపిఆర్‌డి ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నారాలోకేష్‌తో కలసి పాదయాత్రలో పాల్గొన్న కెకె చౌదరి

టిడిపి అధికారంలోకి రావడం ఖాయం

ప్రజాశక్తి-చిట్వేలి

యువగళం పాదయాత్ర మూడువేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం నారా లోకేష్‌కు రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు, టిడిపి మండల అధ్యక్షుడు కెకె చౌదరి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనపై సమరభేరి మోగిస్తూ ఐదు కోట్ల ప్రజల జనగళమే యువగళంగా లోకేష్ పాదయాత్ర చేపట్టారని అన్నారు. పాదయాత్ర ద్వారా అశేష ప్రజాగళంగా మారి యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, కార్మికులు, మరియు అన్ని వర్గాల పేద బడుగు బలహీన వర్గాల ప్రజల భవిష్యత్తుకు భరోసాను నింపిందని అన్నారు. పాదయాత్రలో పాదయాత్ర రూట్ మ్యాప్ కో-ఆర్డినేటర్‌గా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.

జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు జాకీర్ హుస్సేన్ మృతి

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణానికి చెందిన జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారుడు, స్టాంప్ వెండర్ షేక్ జాకీర్ హుస్సేన్ (65) మృతి చెందాడు. ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గత నాలుగు రోజుల నుండి తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడు జాకీర్ వాలీబాల్ జూనియర్స్ విభాగంలో జాతీయస్థాయిలో రాణిస్తున్నప్పుడు పీలేరు పట్టణానికి వాలీబాల్ క్రీడ మాతృ క్రీడగా వెలుగొందింది. మృతుడికి బార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇతని మృతికి సామాజికవేత్త జానం గంగిరెడ్డి, సీనియర్ జర్నలిస్టు పఠాన్‌జాకీర్‌హుస్సేన్, షేక్ ఖాదర్‌బాషా, క్రీడాకారులు మల్లెల మస్తాన్, డెకరేషన్ రమణ, ఆరిఫ్, అంజు, స్టాంప్ వెండర్ల సంఘం నాయకులు నరసింహారెడ్డి, షేక్ మస్తాన్ సాహెబ్‌లు సానుభూతి వ్యక్తం చేశారు.

దుర్గంధభరితంగా మురుగు కాలువలు

ప్రజాశక్తి-కలకడ

కాలువలో పారుతున్న మురుగునీరు

మండల కేంద్రమైన కలకడ సచివాలయం పరిధిలో మురుగునీటి కాలువలు దుర్గంధంగా మారి రోగాలకు నిలయంగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.మండల కేంద్రమైన కలకడ కుమ్మరస్వామిదేవాలయంవీధికి చెందిన మురికికాలువలు పూర్తిగా మురికి నీటితో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల నుంచి వచ్చే దుర్గంధం వల్ల దోమలు విజృంభిస్తున్నాయని మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విషజ్వరాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

ఆటోమెకానిక్ యూనియన్ నాయకుడికి సన్మానం

కలకడ : మండల కేంద్రమైన నవభారత ఆటో మెకానిక్ వ్యవస్థాపకులు సుబహాన్‌ను సోమవారం యూనియన్ నాయకులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కలిసి కటుగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకునేందుకు వీలుంటుందని చెప్పారు. కలకడలో ఆటో మెకానిక్ యూనియన్ అధ్యక్షులుగా రఫీని, ఉపాధ్య క్షులుగా మోయిన్ లను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

బిల్లుగుట్ట చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

గాలివీడు : మండలంలోని అరవీడు పంచాయతీ ఉయ్యాలవాండ్లపల్లిలోని బిల్లుగుట్ట చెరువును, శ్మశానమును అదే గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించారని సోమవారం కలెక్టర్‌కు ఉయ్యాలవానపల్లి గ్రామస్తులు చిన్నకృష్ణారెడ్డి, కుల్లాయిరెడ్డి, సుబ్బారెడ్డి గంగిరెడ్డి,ధర్మారెడ్డి, పాపిరెడ్డిలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ చెరువు కింద 18 ఎకరాల వరి సాగులో ఉందని తెలిపారు. కబ్జాకు గురైన చెరువులు, కుంటలను స్వాధీనం చేసుకొని ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. శ్మశానం కోసం కేటాయించిన స్థలాన్ని కూడా కబ్జా చేసి అందులో చెట్లు నాటారని ఇలా ప్రభుత్వ స్థలాలు అక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

సమస్యకు సత్వర పరిష్కారం

బి.కొత్తకోట : స్థానిక పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న భారత్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ చుట్టుప్రక్కల చెత్తాచెదారం చాలా రోజులుగా పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల ఆవరణంలో పారిశుధ్య పనులు చేయించాలని పాఠశాల యాజమాన్యం,విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సత్వరమే స్పందించి పారిశుధ్య కార్మికుల చేత పాఠశాల చుట్టుప్రక్కల చెత్తాచెదారం తొలగించి,శుభ్రం చేయించారు.

పాఠశాల ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు